కథా నిలయం
శ్రీకాకుళం



# సన్మానం శాలువా!

“ఈసారి పంద్రాగస్టు జండా వందనానికి మినిస్టర్ వస్తున్నారు. మీ పట్టణ కార్యక్రమములో పాల్గొంటారు. అందులో స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానముంటుంది. మీ ప్రాంతములోని స్వాతంత్ర్య సమరయోధుల్ని గౌరవంగా తీసుకురావాలి” జిల్లా కలెక్టర్ ఆదేశం ఆర్డీవో ద్వారా తహసీల్దార్ చేతికొచ్చింది. ఎప్పుడో జరిగిపోయిన స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వాళ్లింకా బతికున్నారా తహసీల్దారు అతలాకుతలమయ్యాడు. రాజు తలుసుకుంటే దెబ్బలకు కొదవా!... ధైర్యం పుంజుకున్నాడు. విలేజ్ అసిస్టెంట్లు నందరినీ సమావేశపరచి “స్వాతంత్ర్య సమరయోధుల్ని వెతికి పట్టుకురావాలే” ఫర్మానా జారీ చేశాడు. అందరూ టపా కట్టేశారు. దుర్భిణిపట్టి వెతికినా దొరకరు.... విలేజ్ అసిస్టెంట్లు వాదన సారాంశం. తహసీల్దార్ బుర్రలో బొంగరాలు తిరిగినై. మొహమ్మీద ముచ్చెమటల ఛాయలు కనబడ్డాయి. “అట్లైట్లా? కనీసం.... ఒక్కరినన్నా పట్టుకరాకపోతే మన ఇజ్జత్‌కు ఇంగులం పెట్టినట్లైతది” గుర్కాయించాడు. ఓ విలేజి అసిస్టెంటు అనుమానంగా లేచాడు “మా ఊర్లె గాలయ్య ఉన్నాడు. ఎనభయ్యేదేండ్లు దాటిన ముసలోడు” చల్లని వార్తమెల్లగా చెప్పాడు “స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నడట” “వెరీగుడ్! మీ గ్రామ సర్పంచ్‌కు ఫోన్ చేస్తా, అతణ్నే పట్టుకు రమ్మని కావాలంటే మన జీబు తీస్కపోయి ఆ పెద్ద మనిషిని గౌరవంగా తోలుకరావాలని” తహసీల్దారు పెదాలమీద చిరునవ్వు చిందులేసింది.

కరకర పొద్దుపొడుస్తోంది. సూర్యకిరణాలు భూమాతకు రంగులద్దుతున్నాయి. “గాలయ్య తాతా! ఓ గాలయ్య తాతా!” సర్పంచ్ తలుపు కొడుతూ గట్టిగా పిలిచాడు. జ్వరంతో బాధపడ్తున్న గాలయ్యకు వినబడింది. కాని చేతకాలేదు. “అరేయ్ నారిగా! ఎవలో వచ్చిండ్రురా! “మనవణ్ని కేకేసాడు... మూల్గుతూ”. నీ యవ్వ.... కమ్మని

నిద్రపొడైపోయింది. "యాల్లగానియాల్ల భూపాలం పాడినట్టు ఏందిరా ముసలోడా?" కళ్లు నులుముకుంటూ గదిలోంచి బయటకొచ్చాడు నారాయణ. సర్పంచ్ పిలుపు మళ్లీ వినబడింది. "ఎవలో వచ్చింర్రు. తలుపు తియ్రా. నాకు జొరమొచ్చింది" గాలయ్య దుప్పటి కప్పుకున్నాడు. ఆవులిస్తూ తలుపు తీసిండు నారాయణ. ఉలిక్కిపడ్డడు. "నువ్వా సర్పంచన్నా! అరె... మనూరి సారుగూడా వచ్చిండు. రాంర్రి..." లోపలికి రానిచ్చి కుర్చీలు చూపాడు.

"ఇగో తమ్మీ!" సర్పంచ్ కరచాలనం చేశాడు. "గాలయ్య తాతతోని అర్జంటుగా మాట్లాడాలె" "రాంర్రన్నా.... మాట్లాడుంర్రి." మంచంపక్క కుర్చీలు వేశాడు. సర్పంచ్, విలేజ్ అసిస్టెంటు కూచున్నారు. నారాయణ చేతులు కట్టుకుని నుంచున్నాడు. "ఏం తాతా బాగున్నావా!" కోరస్‌గా అడిగారు కూచున్నవాళ్లు. దుప్పటి పక్కకు జరిపాడు గాలయ్య. "ఏం బాగ బిడ్డా? జొరమొచ్చింది. ఇంటి సుట్టూ మోరీలాయె. దోమలు జొబ్బుమంటున్నై." ఇంకేదో అంటూ లేవబోయాడు. సర్పంచ్ వారించాడు. "మన ఏరియాల స్వాతంత్ర్య సమరయోధునివి నీవొక్కనివే మిగిలినవ్ గదా! ఎల్లుండి పంద్రాగస్టు నాడు పట్నంలో నీకు సన్మానముంది. మినిస్టర్ వస్తున్నడు తాతా!" "నీయవ్వ... ఓదిక్కునేను జొరమొచ్చి లెవ్వలేకుంటున్న. అక్కడికెట్లా రావాలె? నా స్వతంత్ర్య సమరయోధుని పింఛన్ ఆగి ఆర్నెల్లైంది. పాపం ముసలోడని అడిగెటోల్లే లేరు." ఇటు పక్క తిరిగి మోకాళ్లు ముడుచుకున్నాడు. "జొరం గురించి బాధపడకే తాతా!" సర్పంచ్ అందుకున్నాడు. జేబుల నుంచి సెల్‌ఫోన్ దీసి నెంబర్లు ఒత్తాడు.

"ఆఁ... నేనే సర్పంచ్‌ను డాక్టర్ సాబ్! గీ గాలయ్య తాతకు జొరమొచ్చింది. నేను వాళ్లింట్లనే ఉన్న. నువు మందుల బాక్స్‌తోని జల్దిరావాలె... ఉహుం... దవఖానకు కాదు. వాళ్లింటికే నువురా. లేకపోతే నీ ఆర్.ఎం.పి. సర్టిఫికెట్ క్యాన్సలైతది బిడ్డా!" బుజ్జగింపు మేళవించి బెదిరించాడు. ఆర్.ఎం.పి. రెక్కలుకట్టుకుని వచ్చివాలాడు. గాలయ్యను పరీక్షించి నడుముకు అటొకటి, ఇటొకటి ఇంజెక్షన్లు చేశాడు. "ఇగో! గీ పొడుగుగొట్టం గోలీలు రోజుకు రెండు, గీ గుంర్రని గొలీలు రోజుకు మూడు వాడాలే" గోలీలు నారాయణ కిచ్చాడు. "ఓ నూరు రూపాయలు ఇయ్యి" చేయి చాపాడు. నారాయణ సర్పంచ్ మోహం చూసాడు. "నీయవ్వ పైసలునేనిస్త గానీ..." సర్పంచ్ మొహంలో గాంభీర్యం. "నువ్వేం చేస్తవో నాకు దెల్వదు. రేపటికల్లా ఈ పెద్దమనిషి హుషారుగావాలె. ఎల్లుండి తాతకు పట్నంలో మినిస్టర్ సాబు సన్మానం చేస్తడు. కలెక్టర్ ఆర్డరిది." అరెంపి గుండె పీచుపీచుమన్నది. "సరే సర్పంచ్‌సాబ్. మంచి మందులిస్తున్న రేపటికల్లా లేచి తిరుగుతడు."

విలేజ్ అసిస్టెంట్ లేచినుంచున్నాడు "నారాయణ! తాతకు మొకం కడిగించి ఉప్మా తినిపించు. పాలు దాగిపిచ్చి గోలీలు వెయ్యాలె." హితబోధ చేశాడు. సర్పంచ్ గూడా లేచాడు "తాతా! ఎల్లుండి తెలారగట్ల మీ ఇంటి ముంగట జీబు ఉంటుంది. తయారుగుండు." ఎందరో త్యాగధనుల బలిదానాల ఫలితంగా 15.8.1947 నాడు భారతదేశానికి స్వాతంత్ర్యమొచ్చింది. కాని...తెలంగాణాకు రాలేదు. తన రాజ్యాన్ని భారత యూనియన్లో విలీనం కానివ్వనని నిజాం నవాబు మొరాయించాడు. మతోన్మాదాన్ని నూరిపోసి తన సైనికుల్ని రజాకార్లుగా మార్చి ప్రజల మీదికి పంపించాడు. రజాకార్లు నరరూప రాక్షసులు.

అమాయకులను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. మాకూ స్వాతంత్ర్యం కావాలని తెలంగాణ (నిజాము రాజ్యము) ఉద్యమ కారులు ఆయుధాలతో రజాకార్ల నెదిరించసాగారు. హిందువుల మీద అత్యాచారాలు పెరిగిపోయినై. తెలంగాణ ప్రాంతమంతా అట్టుడికి పోతోంది. రజాకార్లు ఆడవాళ్లను వివస్త్రలుగా మార్చి నడిబజార్లో బతుకమ్మ ఆడించారు. ఓ గర్భవతి రెండుకాళ్లను రెండు జీబులకు కట్టేసి ఆ జీబుల్ని రెండు వైపులా ఒకేసారి పరుగెత్తించారు. గర్భవతి శరీరం రెండుగా చీలిపోయింది. గర్భస్థపిండం బయటపడింది. హాహాకారాలు, అంగలార్పులు ఆకాశాన్నంటాయి. పారుతున్న రక్తాన్ని చూసి రజాకార్లు పగలబడి నవ్వారు. అప్పటికే ఎన్నో ఘోరాలను కళ్లారాచూసిన యువకిశోరం గాలయ్య పిడికిళ్లు బిగుసుకుపోయినై. రోషంతో రక్తం కుతకుతలాడింది. రజాకార్లు జీబు ఎక్కుతున్నారు. ఒకడు బురుజు చాటుకెళ్లి అల్పశంక తీర్చుకుంటున్నాడు. గాలయ్య రామబాణంలా ఉరికాడు. వెనకనుంచి వాని భుజాలు పట్టుకుని తుపాకి లాక్కున్నడు. అక్కడికక్కడే వాన్ని కాల్చేసి పారిపోయాడు. నిజాం పోలీసులు వెతికి పట్టుకున్నారు. జైల్లో వేశారు. గాలయ్య జైల్లో తోటి ఉద్యమకారులతో కలిసి శిక్షలు అనుభవించాడు. వందేమాతరమంటూ గంతులేశాడు. పోలీసులు ఉద్యమకారుల్ని పరమ శత్రువులుగా భావించారు.

ఉద్యమకారులు తాగునీరడిగితే ముంతల మూత్రం పోసిచ్చారు. తినేందుకు పాచిఅన్నం పెట్టారు. "పాచిన అన్నం మనకు మరమాన్నం కావాలి. కటికనేల మన పాలిట పూలపాన్పుకావాలి. అరదండల దెబ్బలు మన విరిదండలు కావాలి"... గొంతెత్తి పాడుతూ అవమానాలు భరించారు. 1948 సెప్టెంబర్లో తెలంగాణ భారతయూనియన్లో కలిసిపోయింది. గాలయ్య విడుదలయ్యాడు. త్యాగాలు చేసినోళ్ల తలలు సగర్వంగా పైకి లేచినై. నైజాం తల నేలకువాలింది. జైలు నుంచి విడుదలయాకే గాలయ్య పెళ్లయింది. అంతా గౌరవంగా చూశారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ మంజూరైంది. తాతలనాటి కొద్దిపాటి పొలాన్ని నమ్ముకుని బతుకు బాటలో చదువుకుంటున్నప్పుడు అల్లుడు, కూతురు

ఓ సంవత్సరం తేడాతో చనిపోయారు. అంతా తనే అయి మనవడు నారాయణను పెంచి పెళ్లిచేశారు. వానలు లేక పంటలు లేవు. పింఛన్ డబ్బులు కూడబెట్టి పొలములో బోర్ వేయించాడు. మొదటి బోర్ ఫెయిలైనా రెండవది నీళ్లు పోసింది. అదైనా మూడు సంవత్సరాలు మురిపించి శాశ్వతంగా నోరు మూసుకుంది. నోరు తెరవడం గాలయ్య వంతయింది. డిగ్రీ చదువుకున్న మనవడు ఉద్యోగందొరక్క ఊరిమీద తిరుగుతూంటే బాధనిపించింది. మనిషి చేయని తప్పులకు మాధవుడు విధించే శిక్షగా ముసలితనం వచ్చేసింది. ఒక్కరోజు బాగుంటే మూడ్రోజులు మంచమ్మీద గడుస్తోంది. పింఛనే కుటుంబానికాధారం. మనవనికి పుత్రోదయమైంది. వెంటనే గాలయ్య పింఛను ఆగిపోయింది. అదెందుకాగిందో తెలీదు. మనసంతా అల్లకల్లోలమైంది. నారాయణ పట్నం ఆఫీసులో అడిగాడు. చూద్దాం, రేపురా..అంటున్నారు గాని ఎవ్వరూ సరియైన జవాబివ్వడం లేదు. మహాకవి దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్నది ఇందుకేనా?

నా పింఛన్ ఎందుకు ఆగిపోయింది? కలెక్టర్ నడుగుతా. వెంటనే ఇప్పించుమని మినిస్టర్ నడుగుతా. ఆశాపాశం బలీయంగా పెనవేసుకు పోతోంది. అదే గాలయ్యను నుంచోబెట్టింది. రెండ్రోజుల వైద్యం అటూ, ఇటు నడిపించింది. రాత్రంతా కలతనిద్ర... అయినా సరే... సూర్యోదయం కంటే ముందే తయారై కూచున్నాడు. పట్నంల తొమ్మిదికి జండావందనమన్నారు. ఏడింటికే ఇంటిముందుకు జీబు వచ్చింది. సర్పంచ్, విలేజి అసిస్టెంటు ఉన్నారందురో. గాలయ్యను జీబులో కూచోబెట్టి వారిద్దరూ చెరోపక్క కుడి - ఎడమ భుజాలుగా కూచున్నారు. పాలనురగలాంటి తెల్లని ధోవతి, ఖాదీషర్టు, గాంధీ టోపీలో గాలయ్య శక్తినంతా కూడగట్టుకుని హుషారుగున్నాడు. సర్పంచ్ మురిసిపోతూ "తాతా! మేము గాంధీ మహాత్మున్ని చూడలేదు కాని నిన్ను చూస్తుంటే గాంధీ తాతను చూసినట్టనిపిస్తుంది." దండం పెట్టాడు.

"అవున్సార్!" విలేజి అసిస్టెంటు అందుకున్నాడు. "అనాడు గిసొంటి మహాత్ములు త్యాగాలు చేసింద్రు కాబట్టి ఇవ్వాళ్ల మనమిట్లా సొతంత్రంగా బతుకుతున్నాం." కావాలనే నవ్వాడు. 'ముసలితాత పంద్రాగస్టు నాడు వైసోడై పోయిండు" ప్రశంసగా చూశాడు. అది గాలయ్యకు చక్కిలిగింతలాగయింది. తనను తాను చూసుకుని ముసిముసిగా నవ్వుకున్నాడు. "అద్సరే బిడ్డా సర్పంచూ! నా పింఛను ఆగిపోయి అర్నెల్లయింది. జెర గా కలెక్టరు, మంత్రికి చెప్పు. "ఓర్నియవ్వ! ప్రాణాలకు తెగించి మనకోసం కొట్లాడిన తాతకే గిట్టయిందా?" సర్పంచ్ ముక్కుమీద వేలేసుకున్నాడు. "ముందుగాల మంత్రికే చెప్తా. పది రోజులల్ల పెన్షన్ ఎట్టారాదో చూస్తా". భరోసా యిచ్చాడు. తాత సంతోషం

అంతింతాకాదు. పట్నంలో దూరిన జీబు హోటల్ ముందాగింది చెయ్యిపట్టుకుని దింపాడు. చాయులు తాగివచ్చి జీబెక్కారు. జీబు ఐదు నిమిషాల్లో కార్యక్రమం స్థలానికి చేరుకుంది. విశాలమైదానములో వరుసగా షామియానాలు వేసున్నాయి. గాలయ్యను వేదిక ముందు కూచోబెట్టారు. సర్పంచ్ ఎవరో లీడర్ వెంటబడ్డాడు. విలేజ్ అసిస్టెంటు రెవిన్యూ ఇన్స్పెక్టర్ వెంటతిరుగుతున్నాడు. సమయం తొమ్మిదైపోయింది. మైకుల దేశభక్తి పాటలు వినబడుతున్నాయి. విద్యార్థులు, సభా నిర్వాహకులు గుంపులుగా వచ్చేస్తున్నారు. కొద్ది సేపట్లోనే మైదానము జాతరలాగైంది. కార్యకర్తలు, పోలీసులు అందరినీ వరుసల్లో కూచోబెడ్తున్నారు. ఆర్డీవో సెల్‌ఫోన్‌ను చెవి కతికించుకుని ఆగమాగంగా అటూఇటూ తిరుగుతున్నాడు. సమయం పది ఐపోయింది. అతిథులకోసం అంతా కళ్లల్లో వత్తులేసుకుని ఎదిరి చూస్తున్నారు. మంత్రివెంట వచ్చేందుకు కలెక్టర్ హైదరాబాదులున్నాడటా. హైదరాబాద్ నుంచి మంత్రి బయలు దేరలేగని తెలిసింది. ఆర్డీవో గాలయ్య ముందుకొచ్చి నమస్కారం చేసి "మీ రిక్కడే కూచోండి. కొద్ది సేపట్లో ప్రొగ్రాం షురువైతది" మొహమ్మీది ఆందోళన ఛాయల్ని చిరునవ్వుతో కప్పేసుకున్నాడు. ఆర్డీవో - డీయస్పీ సంప్రదించుకున్నారు. రాజకీయ సంక్షోభం కారణంగా మంత్రులంతా రాజధానిలోనే ఉండాలని హుకుం జారీ అయింది. అదేవిషయం ఆర్డీవో ద్వారా డియస్పీకి తెలిసింది. కలెక్టర్ గూడా రావడం లేదన్నారు.

సమయం పదకొండు దాటింది. పదకొండున్నరకు ఆర్డీవో ముఖ్యఅతిధిగా మువ్వన్నెల జండాముచ్చటగా గాల్లోకెగిరింది. గాలయ్య గూడా వేదిక మీదున్నాడు. ఆనాటి స్వాతంత్ర్య సమరాన్ని నెమరేసుకుంటున్నాడు. మార్చ్‌పాస్ట్ రంగరంగ వైభోగంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లో గాంధీ, నెహ్రూ, వీరసావర్కర్, భారతమాత సుభాష్ చంద్రబోసులు కన్పించారు. మొదట ఆనందనందన వనములో విహరించిన గాలయ్యను ఆయోమయం ఆవరించింది. పింఛన్ గురించి ఎవరినడగాలి? ఎవరిద్వారా అడగాలి? సర్పంచ్ కనబడలేదు. విలేజ్ అసిస్టెంట్ ఎక్కడో దూరములో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఆర్డీవో దీర్ఘోపన్యాసంలో ఆ ప్రాంతములో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాడు. డీయస్పీ, మున్సిపల్ ఛైర్మన్, ఇంకెవరెవరో మాట్లాడారు. తనగ్గూడా మాట్లాడే అవకాశమొస్తుందనుకున్నాడు గాలయ్య. అవకాశం రాలేదు గాని ఆర్డీవో డీయస్పీ చేతుల మీదుగా శాలువా సన్మానం జరిగింది. ప్రభుత్యోద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం అందరి కరతాళ ధ్వనుల మధ్య జరిగింది. ఉత్తమ ప్రభుత్యోద్యోగుల్లో వాళ్లూరి విలేజి అసిస్టెంట్ గూడా ఉన్నాడు. సమయం.... ఒకటిన్నరైంది. కడుపులో ఆకలికేకలు. కార్యక్రమం ముగిసిందని ప్రకటించారు. తుపాకి పేలిన శబ్దం విన్న పక్షుల్లా ఎవరి

దారిన వారు వెళ్లపోతున్నారు. ఐదు నిమిషాల్లో మైదానం ఖాళీ ఐపోయింది. అంగట్ల అమ్మా అంటే ఎవరికి పుట్టినవ్ బిడ్డా? అన్నట్టుగా పింఛన్ గురించి ఎవరినడగాలి? జేబుల చిల్లిగవ్వలేదు.... ఊరికెట్లా వెళ్లాలి? తాబేలులా అడుగులేస్తూ బస్టాండు చేరుకున్నాడు. ఊరికెళ్లేందుకు బస్సులేదు. ఆటోలు చాలా వున్నాయి. ముగ్గురు కూచోవాల్సిన ఆటోలో పదిమంది కూచున్నారు. రెడీగా ఉన్న ఆటోఎక్కి కూచున్నాడు "వచ్చేటప్పుడు ఎట్లొచ్చినవు తాతా?" ఆటోడ్రైవర్ పలకరింపు. గాలయ్య ముడుచుకున్నాడు "రాంగ తాసిల్దార్ జీబుల తోలుకొచ్చింద్రు బిడ్డా!" అంతరాళాల్లోని బాధ గొంతులో ధ్వనించింది. ఆటో డ్రైవర్ ముసిముసిగా నవ్వుతూ "ఇయ్యాల స్వాతంత్ర్య సమరయోధుణ్ని పట్టుకరాకపోతే మంత్రి కోపానికొస్తడని నిన్ను పట్టుకొచ్చింద్రు తాతా! బస్... వాళ్ల పనైపోయింది...".

ఆటో ఊళ్లో ఆగింది. అందరూ పైసలిస్తూ దిగుతున్నారు. గాలయ్య తప్ప అంతా దిగారు. "దిగేవేమే తాతా?" డ్రైవర్ అడిగాడు. "చాతనైత లేదు బిడ్డా!" నాలుకతడారిపోతోంది. డ్రైవర్ ఆసరాపట్టి దింపాడు. "ఇంగ ఆటో కిరాయి పదిరూపాయలియ్యి తాతా!" చెయ్యి చాపాడు. దృష్టి రంగుల శాలువా మీదుంది. "నా దగ్గర పదిపైసలు గూడాలేవు. గీ శాలువాతోని సన్మానం చేసింద్రు కాని ఒక్కరూపాయి గూడా ఇవ్వలేదు". శాలువా చూపించాడు. ఆటో డ్రైవర్ మొహంలో రంగులు మారాయి. "గట్లంటే ఎట్లనే తాతా? డిగ్రీ పాసైన, పొట్టకూటికోసం ఆటో నడుపుతున్న" "కాని నేనేమియ్యాలే బిడ్డా! నా దగ్గర గీ శాలువతప్ప ఏమీలేదు". "సరే... గా శాలువనే నాకిచ్చెయ్. చలికాలం... నీ పేరుజెప్పి కప్పుకుంట." ఒంటి మీంచి శాలువా లాక్కుని ఆటో పరుగెత్తించాడు.

*(కదలిక మాసపత్రిక – అక్టోబర్ 2011 కథల పోటీల్లో బహుమతి పొందినది)*